
బహుమతులు పొందిన వివిధ పాఠశాల విద్యార్థులు

# విద్యార్థులందరూ విజేతలే..

- ప్రతి ప్రాజెక్టు ఓ అద్భుతం
- వినూత్న ఆలోచనలతో 244 ప్రదర్శనలు
- కలెక్టర్ విజయేంద్ర బోయి
- జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ విజయవంతం


ప్రదర్శనలు తిలకిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్నగర్ బ్యూరో, జనవరి 5, ప్రభాతవార్త:** నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలకు తమ మేధస్సుతో పరిష్కార మార్గాలు చూపుతున్న విద్యార్థులందరూ విజేతలేనని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ప్రశంసించారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి ప్రాజెక్ట ఎంతో అద్భుతంగా ఉందని, వాటిని బెస్ట్ ప్రాజెక్టులుగా ఆమె అభివర్ణించారు. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమి తం కాకుండా, సమాజంలోని అవసరాలను గుర్తించి వినూత్న ఆలోచనలతో మోడల్స్ తయారు చేయడం అభినందనీయమన్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వయస్సు పైబడిన వారి సమస్యలు, వర్షాకాలంలో మ్యాన్ హోల్స్ వల్ల కలిగే ప్రమాదాల నివారణకు విద్యార్థులు రూపొందించిన రక్షణ వ్యవస్థలు ఎంతో ఆదర్శంగా ఉన్నాయని కలెక్టర్ కొనియాడారు. విద్యా ర్థుల మేధస్సు నుంచి పుట్టిన ఈ అద్భుతమైన ఆలోచనలను వివిధ ప్రభుత్వ విభాగాలు పరిశీలించి, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసే దిశగా చూడాలని ఆమె సూచించారు. విద్యా ర్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్న సైన్స్ ఉపాధ్యాయుల కృషిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. చివరగా, విద్యార్థులు ఇదే స్ఫూర్తిని మున్ముందు కూడా కొనసాగించాలని, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చాటి విజే తలుగా నిలవాలని కలెక్టర్ విజయేంద్రి బోయి ఆకాంక్షించారు.

### సృజనాత్మకతకు నిలువుటద్దంలా నిలిచాయి: డీఈవో

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ మరియు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మకతకు నిలువుటద్దంలా నిలిచాయని జిల్లా విద్యాశాఖ అధికారి (దీనివీ) ప్రవీణ్ కుమార్ అన్నారు. స్థానిక విజ్ఞాన ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 244 ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు వినూత్న ఆలోచనలతో అద్భుతమైన ప్రయోగాలను ప్రదర్శించారని, అభినందనీయమని కొనియాడారు. సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవడానికి ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని, ప్రతి ఏటా జరగాలని ఆకాంక్షించారు.

### 2000 మందికి పైగా హాజరు

ఈ ప్రదర్శనను తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 2,000 మందికి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలివచ్చారు. ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల మోడల్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎంఒ దుంకడు శ్రీనివాస్, సీఎంఒ సుధాకర్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఎండీ శంషీర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రదర్శనలు తిలకిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి


నృత్యం చేస్తున్న విద్యార్థులు


విద్యార్థితో కలిసి బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయుడు అశోక్

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# అధికారులు అందరూ బాధ్యతతో పనిచేయాలి

## గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్


జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తి అయినందున కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

**గద్వాల జనవరి 5, ప్రభాతవార్త:** జిల్లాలో అధికారులందరూ పూర్తి భాధ్యతతో పని చేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు కోరారు. సోమవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు జోగులాంబ గద్వాల జిల్లాలో రెండేళ్లపాటు సేవలందించిన జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్, ఐఏఎస్ ను జిల్లా అధికారులు, తహసీల్దార్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో కలెక్టర్‌గా రెండేళ్లపాటు సేవలందించడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పని చేయకముందు తాను జీహెచ్‌ఎంసీ, టీజీపీఎస్సీ వంటి సంస్థల్లో పని చేసిన అనుభవం ఉందని, జిల్లా కలెక్టర్‌గా తన మొదటి పోస్టింగ్ జోగులాంబ గద్వాల జిల్లానే కావడం తనకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందన్నారు. జిల్లాలో పని చేస్తూ అనేక విషయాలు నేర్చుకున్నానని, ఈ జిల్లా ఇక్కడి అధికారులు, ప్రజలు తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనని కలెక్టర్ పేర్కొన్నారు. వచ్చిన మొదటి సంవత్సరంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, అధికారుల సహకారం, సమన్వయంతో వాటినిఅధిగమించి ముందుకు సాగగలిగామని తెలిపారు. మంచి టీమ్ ఉన్నందునే జిల్లాలో కలెక్టర్‌గా విజయవంతంగా పని చేయడం సాధ్యమైందని స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా విజయవంతంగా నిర్వహించమని తెలిపారు. ఈ జిల్లాలో లభించిన అనుభవం తన భవిష్యత్ పరిపాలనా జీవితంలో మరింత మంచి పనులు చేయడానికి ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అధికారులకు కల్పించిన అధికారాలను ప్రజల అభివృద్ధి కోసం సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లా విద్యాపరంగా ఇంకా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, అందరూ కలిసి కృషి చేసి అక్షరాస్యతను పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం తనకు సహకరించిన ప్రతి ఒక్క అధికారి, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, జోగులాంబ గద్వాల జిల్లా తనకు ఎప్పటికీ గుర్తుండిపోయే జిల్లాగా నిలిచిపోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, ఆర్డీఓ అలివేలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ జెండా మోసిన వారికి ప్రాధాన్యం

- టికెట్ల కోసం సర్వేలు నిర్వహిస్తాం
- డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్, జనవరి 5, ప్రభాతవార్త:** పార్టీ టికెట్ల కోసం సర్వేలు నిర్వహిస్తామని డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన నాయకుల, కార్యకర్తల సమావేశంలో డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. పార్టీ కోసం పని చేసిన వారు సర్వేలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ వారిని ఒకటో స్థానంలోకి తీసుకొస్తామని, టికెట్లు ఇస్తామని అన్నారు. కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఎలాంటి అపోహాలు ఉన్న జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎవరి మాటలను నమ్మవద్దని, డిసిసి అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షులను సంప్రదించాలని కోరారు. అనంతరం కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు పలువురు నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. 40వ డివిజన్ క్రిస్టియన్ కాలనీ నుంచిసిబి శ్రీపూజిత దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రకుమార్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలో తెలంగాణను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చిండ్రు

- అసెంబ్లీలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి


అసెంబ్లీలో డ్రగ్స్‌పై మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**దేవరకద్ర, జనవరి 5 ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ పాలనలో యువత ఉద్యోగాలు లేకనే డ్రగ్స్‌కు బానిసలు అయ్యారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీలో ఈ విషయం ప్రస్తావిస్తూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మార్చిన పరిస్థితి. తెలంగాణను డ్రగ్స్ కు అడ్డాగా మార్చిండ్రు. నేడు మన ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత డ్రగ్స్‌పై ముఖ్యమంత్రి చొరవ తీసుకొని డ్రగ్స్ బారిన పడకుండా యువతను కాపాడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలకు, గంజాయికి బానిసలుగా మారిన యువత మత్తులో తూగుతూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నది. మాదకద్రవ్యాలను నియంత్రించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుంటుంది. ఇది ఇలాగే కొనసాగితే భావితరాల భవిష్యత్తు అందకారమవుతుందని, ఈ గాంజాను, డ్రగ్స్‌ను విస్తరించకుండా బలమైన చర్యలు తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కోరారు.

# సర్పంచ్ ఎన్నికలను రీ కౌంటింగ్ చేయాలి

## జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన బింగిదొడ్డి గ్రామస్తులు



**అయిజ జనవరి 5, ప్రభాతవార్త;** మండల పరిధిలోని బింగ్దొడ్డి గ్రామంలో సర్పంచ్ ఎన్నికలను రీకౌంటింగ్ చేయాలని సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బియం సంతోష్ కు గ్రామస్తులు విన్నవించారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం డిసెంబర్ 14న జరిగిన సర్పంచ్ ఎన్నికలలో కౌంటింగ్ లో తేడాలు ఉన్నాయని ఇందులో భాగంగా 2,257 ఓట్లు పోలయ్యాని తెలిపిన ఆర్వో అయితే కౌంటింగ్ లో మాత్రం 2156ఓట్లు ఉన్నట్లు ఆర్వో నిర్ధారించి సుమారు 101 ఓట్లకు సంబంధించి పూర్తి సమాచారం తెలుపకుండానే గెలుపోవటం నిర్ధారించి ఆర్వో వెళ్లిపోయాడని ఆవేదన చెందారు. ఈ విషయంపైమరల సమగ్రంగా విచారణ జరిపి ఆర్ఓ పై చర్యలు తీసుకొని మరల రీకౌంటింగ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు. వినతి పత్రం అందించిన వారిలో యు. రామకృష్ణ, ఎం. నరసింహులు తదితరులు ఉన్నారు.

# గంజాయి ఉత్పత్తులపై నిఘా

## వనపర్తి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ధ్యేయం: వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


నార్కోటిక్ కమిటీతో సమావేశమైన కలెక్టర్

**వనపర్తి, జనవరి 5 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి నార్కోటిక్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీ డి.సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న గంజాయి రవాణా, గంజాయి సాగు కేసులు, మాదక ద్రవ్యాలు వాడుతున్న వారి కేసులపై ఆరా తీయగా డిఎస్పీ బాలాజీ నాయక్ వివరాలు తెలిపారు. 2017,25 మధ్యకాలంలో 25 కేసులు నమోదైనట్లు తెలి పారు. స్పందించిన కలెక్టర్ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేయడం కానీ వినియోగించడం కానీ జరుగకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని సూచించారు. మెడికల్ దుకాణాలలో ఆల్ప్రాజోలం వంటి డ్రగ్స్‌ను డాక్టర్ సిఫారసు చేయకుండా ఇవ్వవద్దని ఆదేశించారు. అనుమతులు లేకుండా అలాంటి డ్రగ్స్ ఎవరైనా అమ్మితే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారికి సూచించారు. కాగా సంబంధిత అధికారి స్పందిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని కల్లుదుకాణాలపై నిఘా ఉంచాలని, మైనర్లకు చిన్న పిల్లలకు కల్లు ఇవ్వకుండా దుకాణదారులకు సూచన చేయాలని అబ్కారి శాఖ అధికారికి సూచించారు. కల్లులో అల్ప్రాజోలం అనే మత్తు పదా ర్థం వినియోగాన్ని కట్టడి చేయాలన్నారు. చిన్నపిల్లలకు కల్లు అమ్మిన దుకాణాల లైసెన్స్ రద్దు చేసే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. గంజాయి సాగుపై వ్యవసాయ విస్తర్ణాధికారుల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాగును గుర్తించాల్సిన బాధ్యత ఏఈఒలపై ఉందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి, ఇదివరకే ఏర్పాటు చేసి ఉంటే యాక్టివేట్ చేసి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాల పై అవగాహనకల్పించాలన్నారు. జిల్లా కేంద్రంలో మాదకద్ర వ్యాల సరఫరా పై అనుమానిత ప్రాంతాల్లో దృష్టి సారించి విద్యార్థులను డ్రగ్స్ వైపు మల్లకుండా చర్యలు తీసుకోవాల న్నారు. జిల్లా ఎస్పీ సునీత మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించే వారిపై, సరఫరా చేసే వారిపై, గంజాయి పండించే వారిపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈగల్ టీం ఆధ్వ ర్యంలో కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి నిరంతర అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తే జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దగలమని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జడ్చర్లను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేయాలి

- మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్కటే రెవెన్యూ డివిజన్
- రెండు హైవేల కూడలిగా ఉన్న జడ్చర్లకు ఆర్టీసీ డిపో మంజూరు చేయాలి
- జడ్చర్ల రూరల్ మండలాన్ని కూడా ఏర్పాటు చేయాలి
- అసెంబ్లీ జీరో అవర్ లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి


అసెంబ్లీలో మాట్లాడుతున్న అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, జనవరి 5,ప్రభాతవార్త:** రెండు జాతీయ రహదారులకు కూడలి కేంద్రంగా ఉన్న జడ్చర్లకు రెవెన్యూ డివిజన్, బస్ డిపోలను మంజూరు చేయాలని, కొల్లూరును కొత్త మండలంగా ప్రకటించాలని, జడ్చర్ల రూరల్ మండలం ఏర్పాటు చేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్ల ప్రాంతానికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. సోమవారం అసెంబ్లీ జీరో అవర్ లో ఈ విషయం గురించి అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన నాగర్ కర్నూల్ జిల్లాలో 20 మండలాలు ఉండగా ఆజిల్లాలో 4 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయని తెలిపారు. 13 మండలాలు ఉన్న జోగుళాంబ గద్వాల, నారాయణ పేట జిల్లాల్లో కూడా ఒక్కో రెవెన్యూ డివిజన్ ఉండగా 17మండలాలు, 306రెవెన్యూ గ్రామాలు కలిగిన మహబూబ్ నగర్ జిల్లాలో కేవలంఒకే ఒక్క రెవెన్యూ డివిజన్ ఉందని చెప్పారు. 6.43 లక్షలఎకరాల భూమి, 10.12లక్షల జనాభా కలిగిన మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక్క రెవెన్యూ డివిజనే ఉండటంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని వివరించారు. తమ జిల్లా పరిధిలోని బాలానగర్, రాజా పూర్, జడ్చర్ల తదితర మండలాలు 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్నాయని, జడ్చర్ల అటు 44వ నెంబర్ జాతీయ రహదారి, ఇటు 167వ నెంబర్ జాతీయ రహదారులకు కూడలిగా ఉందని చెప్పారు. జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఊర్కొండ మండలాన్ని నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోకి చేర్చి తమ జడ్చర్లకు అన్యాయం చేసారని అభిప్రాయపడ్డారు. అన్ని అర్హతలు కలిగిన జడ్చర్లను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చాలని కోరారు. రెండు జాతీయ రహదారులకు కూడలి కేంద్రంగా, పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా ఉన్న జడ్చర్లలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేయాలని ప్రజలు చాలా కాలంగా కోరుతున్నారని గుర్తు చేసారు. నవాబుపేట మండలం లో కొల్లూరును కూడా కొత్త మండలం గా చేయాలని, జడ్చర్ల రూరల్ మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో జడ్చర్లకు ఉన్న ఎమ్మెల్యేలు ఎవరూ అసెంబ్లీలో మాట్లాడనందున ఈ సమస్యలు పరి ష్కారం కాలేదని, ఇప్పుడు తనకు అవకాశం రావడంతో తాను మాట్లాడు తున్నానని అన్నారు. అనిరుధ్ రెడ్డి చెప్పిన విషయాలను నోట్ చేసుకు న్నామని మంత్రి కొండా సురేఖ ప్రకటించారు.

# గురుకులాల బలోపేతానికై నిధులు మంజూరు

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 5 ప్రభాతవార్త :** గురుకులాల బలోపేతానికి రూ.10.65 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలోని పలు విద్యాసంస్థల బలోపేతంపై వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఆయరాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో భాగంగా ఖిల్లా ఘణపురం మండల బాలుర ఆశ్రమ పాఠశాలలో డార్మెటరీ డైనింగ్ హాల్ నిర్మాణాలకు 2 కోట్ల రూపాయలు. వనపర్తి మండలం మర్రికుంటలోని బాలికల గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలో డైనింగ్ హాల్ ,వంట గదుల నిర్మాణానికి రూ 1.50కోట్ల రూపాయలు. మర్రికుంట బాలికల గిరిజన గురుకుల పాఠశాల అధ్యాపక నివాస సముదాయ (స్టాఫ్ క్వార్టర్స్) నిర్మాణానికి రూ 1.50 కోట్లు,పెద్దమందడి మండలం బుగ్గపల్లి తాండ రాజపేట శివారులోని బాలుర గిరిజన గురుకుల పాఠశాల లో డైనింగ్ హాల్,అధ్యాపక నివాస సముదాయ భవనం, అర్బన్ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహ నిర్మాణానికిరూ.2.65 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించిన పనుల ప్రారంభానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతున్నాయని ఈ భవన నిర్మాణాలతో వనపర్తి నియోజకవర్గ పరిధిలోని విద్యాసంస్థలన్నీ బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి
- రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై ప్రతిజ్ఞ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు, అధికారులు


రోడ్డు భద్రత,ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 5, ప్రభాతవార్త:** జనవరి 1 నుండి 31 వరకు జరుగుతున్న జాతీయ రోడ్డు భద్రత అవగాహన మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరం లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,జిల్లాఅధికారులు,సిబ్బందిరోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు,ప్రజలు హెల్మెట్ ధరించాలని అన్నారు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో తలకు గాయం కాకుండా నివారించి మన విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు పై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు.అలాగే నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్‌ధరించాలని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని అన్నారుఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, ఆర్డీవో ఈ. నవీన్, జిల్లా రవాణా శాఖ అధికారి రఘు, డీఆర్‌డీఓ నరసింహులు, రవాణా శాఖ సిబ్బంది, జిల్లా కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి5, ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 90ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్.పి సి.ఈ.ఓ వెంకటరెడ్డి, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, ఆర్.డి.ఓ నవీన్, వివిధ శాఖలజిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ఐ జాతీయ నెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

**జడ్చర్ల, జనవరి 5 ప్రభాతవార్త :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇఎం), బాలుర-1, జడ్చర్ల కు చెందిన విద్యార్థి కైఫ్ ఖాన్ ఎస్‌జిఎఫ్ఐ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు తెలంగాణ రాష్ట్రాన్ని ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. జాతీయ స్థాయిలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొనే ఈ ఎస్‌జిఎఫ్ఐ జాతీయ నెట్‌బాల్ పోటీలు రాజస్థాన్ రాష్ట్రంలో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనడానికి కైఫ్ ఖాన్ రాజస్థాన్‌కు వెళ్లనున్నారు. ఆయన ఈ స్థాయికి చేరుకోవడం ఆయన కష్టపడి సాధన చేయడం, క్రమశిక్షణ, క్రీడాపై ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పారిజాత విద్యార్థిని అభినందిస్తూ, జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచి పాఠశాలకు, రాష్ట్రానికి గౌరవాన్ని తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి విజయాలు ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. అలాగే విద్యార్థికి నిరంతర శిక్షణ మార్గదర్శకత్వం అందించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పిఇటి) శివప్రసాద్ సేవలను పాఠశాల ప్రత్యేకంగా అభినందించింది. పాఠశాల సిబ్బంది, యాజమాన్యం మొత్తం కైఫ్ ఖాన్ జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎంపికైన విద్యార్థితో ప్రిన్సిపాల్ పారిజాతం,ఉపాధ్యాయులు

## గ్రామపంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : సర్పంచ్ లక్ష్మణ్

**బాలానగర్, జనవరి 5 ప్రభాతవార్త :** సంవత్సరాల తరబడి గ్రామంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని చింతకుంట తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం చింతకుంట తండా పంచాయతీ పరిధిలోని చింతకుంట, ఎర్రకుంట తండాలలో పర్యటించిన లక్ష్మణ్ నాయక్ తండాలలో ఉన్న మంచినీటి సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అంగన్‌వాడీ భవనం, వీధి దీపాలు తదితర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని తండా వాసులకు హామీ ఇచ్చారు. మండలంలోని చింతకుంట తాండను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ నాయక్ తో పాటు వార్డు మెంబర్లు రవి, నరసింహులు, రమేష్, భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తండాలలో పర్యటిస్తున్న చింతకుంట తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్

## శాంతినగర్‌లో ఘనంగా రోడ్ భద్రత మసోత్సవాలు

**గద్వాల జనవరి 5,ప్రభాతవార్త:** ఆలంపూర్ తాలూకా శాంతి నగర్ మండల కేంద్రంలో ఆర్‌టిఓ అధికారులు రోడ్ భద్రత మసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీకృష్ణ హైస్కూల్‌లో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించి రోడ్లపై వాహనం డ్రైవింగ్ చేస్తూ ప్రయాణం చేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రయాణంలో రోడ్ సేఫ్టీ నియమాలు తప్పక పాటించాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అందరూ పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఓ అధికారులు అసిస్టెంట్ ఎం.వి.ఐ.లు జానకి రాములు, వెంకట రమణ రెడ్డిలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్ భద్రత మసోత్సవాలలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎం వి ఐ జానకి రాములు

## నీటి సరఫరా పాక్షికంగా నిలిపివేత


**నారాయణపేట, జనవరి 5 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బ తినడం వల్ల మొత్తంగా 710 గ్రామాలు, 6 మున్సిపాలిటీలు ఈ నీటి సరఫరా నిలిపివేత పరిధిలోకి వస్తాయి. అత్యవసర మరమ్మత్తు పనులు పూర్తిచేసి సాధ్యమైనంత త్వరగా నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నాము. ఈ కాలంలో ప్రజలందరూ అవసరమైన నీటిని ముందుగానే నిల్వ చేసుకుని, సహకరించగలరని మనవి. ప్రధాన పైప్‌లైన్‌లో బటర్‌ఫ్లై వాల్వ్ గాస్కెట్ దెబ్బతినడం వల్ల అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టాల్సి వచ్చింది. ఈ కారణంగా తేది 07.01.2026 ఉదయం 9:00 గంటల నుండి 10.01.2026 అర్ధరాత్రి 12:00 గంటల వరకు మొత్తం 90 గంటల పాటు నీటి సరఫరా పాక్షి కంగా/పూర్తిగా నిలిపివేయబడుతుంది. ఈ మరమ్మత్తు పనుల కారణంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని 13 మండలాల పరిధిలో ఉన్న 518 గ్రామాలు, 4 మున్సిపాలిటీలు, నారాయణపేట జిల్లాలోని 8 మండలాల పరిధిలోని 184 గ్రామాలు నీటి సరఫరా నిలవడంతో ముందు జాగ్రత్తగా నీటిని నింపుకొని పెట్టుకోవాలని మిషన్ భగీరథ అధికారులు తెలియజేశారు.

## తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

**నారాయణపేట, జనవరి 5 ప్రభాతవార్త :** నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.సంపత్ కుమార్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. ఆదిత్య గౌడ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చి పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న నర్సింగ్ సిబ్బందిని అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మంచి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్‌ఎంవోడా.బాలాజీ, డా.రాఘవేందర్,మెడిసిన్ హెచ్ఓడి నజ్మ,పాథాలజీ హెచ్ఓడి సుందరీదేవీ,నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన, యూని యన్ ప్రెసిడెంట్ కవిత, కల్చరల్ యాక్టివిటీ ఎం.కిరణ్ కుమార్, జనరల్ సెక్రెటరీ దీక్షిత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి షబ్బీర్, జనరల్ సెక్రెటరీ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జ్ హనుమంతు, విజయ్ కుమార్, మెంబర్స్ అనసూయమ్మ, పల్లవి, బి.శ్రీనివాస్, జమున నారాయణమ్మ,అచ్యుత్ రెడ్డి, ముస్తఫా,ఆంజనేయులు, వినోద్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ


**నర్వ, జనవరి 5 ప్రభాతవార్త:** పీఆర్‌టీయూ టీఎస్ 2026వ సంవత్సరం క్యాలెండర్‌ను ఎంఈఓ బి.రామ్‌రెడ్డితో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసులు ఆవిష్కరించారు.సోమవారము పీఆర్‌టీయూ నాయకులు నర్వ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపిడిఓను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి. కృష్ణారెడ్డి, నర్వ కాంప్లెక్స్ జిహెచ్‌ఎం సునీత, నర్వ మండల పిఆర్టియు అధ్యక్షులు సూరం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి హరీష్, గౌరవాధ్యక్షులు రాఘవ రెడ్డి, పిఆర్టియు మండల అసోసియేట్ అధ్యక్షులు మల్లేష్, జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, పిఆర్టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఉస్మాన్, పిఆర్టియు సీనియర్ నాయకులు మధుసూదన్, దామోదర్ రెడ్డి, విజయ్ కుమార్, నరేష్ కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పిఆర్‌టియు టిఎస్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**నవాబుపేట, జనవరి 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో వారం రోజుల క్రితం బూడిది శాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని జీకే ట్రస్ట్ సభ్యులు పరామర్శించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ జేకే కుటుంబ ట్రస్టు ద్వారా తమ వంతు ఆర్థిక సహాయంగా 25 కిలోల బియ్యం, రూ. 5000ల ఆర్థిక సహాయము అందించడం జరిగింది. జెకె ట్రస్ట్ సభ్యులు, మృతురాలి కుటుంబ సభ్యులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

**మహబూబ్‌గర్ బ్యూరో, జనవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని, ఈ మేరకు కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో నాయకులు, కార్యకర్తలు పర్యటించాలని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ను కాంగ్రెస్ పార్టీ గెలిచేవిధంగా సమిష్టిగా పనిచేయాలని కోరారు. టికెట్ల ఎంపిక కోసం సర్వేలు నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో పది డివిజన్లకు ఇద్దరి కోఆర్డినేటర్లను నియమించామని అన్నారు. 1 నుంచి 10 డివిజన్లకు బెక్కరి అనితరెడ్డి, ప్రవీణ్, 11 నుంచి 20కు అవేజ్ అహ్మద్, నాగరాజు, 21 నుంచి 30 డివిజన్లకు పయాజ్, అబ్రార్, 31 నుంచి 40 డివిజన్లకు అజ్మత్‌అలీ, ఎండి.అక్బర్, 41 నుంచి 50 డివిజన్లకు రాములుయాదవ్, మల్లేష్ యాదవ్, 51 నుంచి 60 డివిజన్లకు సాయిబాబా, బాలస్వామిలను కోఆర్డినేటర్లుగా నియమించడం జరిగిందన్నారు. పోటీలో నిలబడాకునే వారు తమ వ్యక్తిగత బయోడేటా వివరాలను ఆయా డివిజన్ల కోఆర్డినేటర్లకు అందజేయాలని ఆయన కోరారు. టీజీఎంఎఫ్ సి చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ పట్టణంలో జరిగిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగినవేనని అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ లో బైపాస్ రోడ్డు తాగునీటి సమస్య పరిష్కారం కోసం కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పదేళ్లపాటు గత ప్రభుత్వం చేసిందేమిలే దని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పట్టణానికి రింగ్ రోడ్డు. మరోబైపాస్ రోడ్డు తీసుకొచ్చినట్లు తెలిపారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బెక్కరి అనిత, నాయకులు వినోద్ కుమార్. మిథున్ రెడ్డి, ఎం. సురేందర్ రెడ్డి, సీజే బెనహర్, రాజేందర్ రెడ్డి. మక్సూద్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సంజీవ్ ముదిరాజ్

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి : ఎస్పీ

**గద్వాల జనవరి 5, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు స్వయంగా స్వీకరించారు.బాధితుల సమస్యలను ఎస్పీ సావధానంగా విని, సంబంధిత అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయా ఫిర్యాదులకు సంబంధించిన పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌ద్వారా మాట్లాడి,బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారమయ్యాయో నిరంతరం సమీకించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల, వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బాధితులకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉంటానని తెలిపారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో న్యాయం జరగలేదని ఎవరైనా భావిస్తే, నేరుగా తమను కలిసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.భూ వివాదాలు, ఆస్థి తగాదాల విషయంలో చట్టం మరియు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ స్పష్టం చేశారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాస రావు

## విద్యా ప్రగతికి వారధి తపస్ కాలమానిని : ఎంఈఓ అమీరుద్దిన్

**మక్తల్ టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** విద్యావనంలో అక్షర సేద్యం చేస్తున్న ఉపాధ్యాయ లోకానికి దిక్సూచిగా, నూతన సంవత్సరానికి స్వాగతంపలుకుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ మహోత్సవానికి మక్తల్ మండల విద్యాశాఖ అధికారి ఖాజాఅమీరుద్దీన్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగార్జున, ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్, జాకీర్ హుస్సేన్, వెంకట్ రాములు, గురుపాదయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి, టిపీయూఎస్ 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించి, సంఘం యొక్క కార్యదీక్షను, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ ఆత్మీయ కార్యక్రమం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవీందర్, మండల అధ్యక్షులు నర్సిములు, గౌరవ అధ్యక్షులు నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాకేష్, జిల్లా బాధ్యులు వెంకట్రాములు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం కేవలం ఒక క్యాలెండర్ ఆవిష్కరణగానే కాకుండా, ఇదొక విద్యా కుటుంబ సమ్మేళనంగా సాగింది. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శులు, ఉపాధ్యక్షులు మండల కన్వీనర్‌లు, టీయుపిఎస్ కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొని, రాబోయే ఏడాది ఉపాధ్యాయ లోకానికి శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, శంకరయ్య, రాములు, వీణ, ప్రసన్న కుమారి, రేణుక, జ్ఞానేశ్వరి, పరంజ్యోతి, సుభాషిణి, మానస, బిందు, నందిని,పుష్పలత, రాజేశ్వరి, ప్రవీణ్,గోపాల్, వెంకటయ్య, రాజంజనేయులు, రాము గౌడ్, నరేంద్ర చారీ, సురేష్, పవర్ధన్, శంకర్, రియాజ్, అంజన్న, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్, రవి, దేవేందర్, జైపాల్ రెడ్డి, మహేష్, నర్సిములు, రమేష్, కనకాద్రి, నర్సిములు, వి.నర్సిములు,దన్ సింగ్, అంజప్ప, ప్రకాష్, నర్సిములు, జగదీశ్, శివరాజ్ పాల్గొన్నారు.



2026 క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ఉప్పునుంతలలో భద్రత వారోత్సవాలపై భారీ ర్యాలీ

**ఉప్పునుంతల, జనవరి 5 ప్రభాతవార్త :** జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు భాగంగా సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడుతూ యువత మధ్యమధ్యలో వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకోకూడదని, హెల్మెట్, సీటు బెల్టు ధరించి వాహనాలు నడిపించాలని, లేకపోతే ప్రాణాలు పోతాయని ఆయన సూచించారు. అతివేగం ప్రమాదకరమని, హెచ్చరిక బోర్డులను అనుసరించి వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లకు మోటార్ సైకిల్ ఇవ్వకూడదని, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి ద్విచక్ర వాహనాలను చిన్నారులకు ఇవ్వకూడదని సూచించారు. ప్రతి వాహన చోదకుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా పలువురు ప్రసంగించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీ గ్రామంలో నిర్వహించారు.ఈ ర్యాలీలో ఎస్సై వెంక రెడ్డి తో పాటు, ఏఎస్ఐ రెడ్యానాయక్, స్థానిక సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు,ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, నాయకులు కట్ట అనంతరెడ్డి, మేడ మోని శ్రీనివాసులు,బొల్లె లక్ష్మయ్య, చింత గాళ్ళ సుధాకర్, ఎల్లయ్య, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి యువకులు పోలీస్ సిబ్బంది వీరారెడ్డి, విష్ణు, వెంకటేష్‌తో పాటు పలువురు కానిస్టేబుళ్ళ, వార్డు సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్ రెడ్డి

## ఐఐఐటీలో అత్యధిక సీట్లు మహబూబ్‌నగర్ విద్యార్థులే సాధించాలి

**మహబూబ్‌గర్ బ్యూరో, జనవరి 5, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ విద్యార్థులు ఐఐఐటి కళాశాలలో అత్యధిక సంఖ్యలో సీట్లు సాధించడమే లక్ష్యంగా పట్టుదలతో చదువుకొని, మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వించే స్థాయికి ఎదగాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం తన స్వంత నిధులతో ఉచితంగా డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌ను అందించడం విద్యాపట్ల ఉన్న నిజమైన నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చాలనే స్పష్టమైన విజన్‌తో, ముఖ్యమంత్రిని ఒప్పించి ఐఐఐటి వంటి ప్రతిష్టాత్మక సంస్థను జిల్లాకు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికే దక్కుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఇన్నేళ్లుగా నిరక్ష్యం పాలైన మహబూబ్‌నగర్ విద్యార్థుల కలలను సాకారం చేసిన ప్రజా ప్రభుత్వం, విద్యారంగంలో సామాజిక న్యాయం అమలు చేస్తోందని తెలిపారు. ఇకపై ఐఐఐటి కళాశాలలో మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులే అత్యధిక సీట్లు సాధించాలనేది తమ సంకల్పమని నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాహేర్, ఆజిమ్, అనిల్ పాల్గొన్నారు.



డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్‌తో విద్యార్థులు

## ప్రపంచ తెలుగు మహాసభల్లో ధన్వాడ యువ రచయితకు కాంస్య పతకం

**ధన్వాడ, జనవరి 5 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా వేదికగా జరుగుతున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభ ల్లో పాల్గొని కవితా పఠనం చేసినందుకు ధన్వాడ గ్రామానికి చెం దిన యువ రచయిత, రంగస్థల నటుడు మొల్కమొళ్ళ బాలకృష్ణ గౌడ్ కాంస్య పతకంతో సన్మానించబడ్డారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ బృహత్తర మహాసభలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ఎంపీలు,ఎమ్మెల్యేలు,రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి కూడా అనేక మంది తెలుగు సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రపంచ తెలుగు మహాసభలు తెలుగు భాష పరిరక్షణకు, సాహిత్య వికాసానికి, సాంస్కృతిక కళారంగ అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేదికపై రచయితగా పాల్గొనడం తనకు గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నట్లు బాలకృష్ణ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ధన్వాడకు చెందిన పలువురు సాహిత్యాభిమానులు, ప్రపంచ తెలుగు మహాసభల్లో ఎంబి బాలకృష్ణ గౌడ్ పాల్గొనడం గ్రామానికి గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు సాహిత్యం, కళల పట్ల ఉన్న అభిరుచిని ప్రశంసించారు.





రచయితకు కాంస్య పతకం అందజేస్తున్న దృశ్యం

## జిల్లాలో రైస్ మిల్స్‌ను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



సోలిపూర్ లోని సింధు రైస్ మిల్ లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

**ఖిల్లా ఘనపురం జనవరి 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సోలిపూర్ గ్రామంలో సింధు రైస్ మిల్స్ తో పాటు గోపాల్పేట్ మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన నవ్య రైస్ మిల్లులను రాష్ట్ర విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. పై మూడు మిల్లులకు 2022 సంవత్సరం నుండి 2025 వరకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వానికి ఇప్పటివరకు ఎన్ని బస్తాల బియ్యాన్ని సరఫరా చేసిన దానితోపాటు పై మూడు రైస్ మిల్లులకు సంబంధించి యజమాని దగ్గర ఉన్న వరి ధాన్యాన్ని రేపటి వరకు జరుగుతాయన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు సీఐ గణేష్ తాసిల్దార్ రాజశేఖర్ డిప్యూటీ తాసిల్దార్ పరమేష్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## కుప్పగండ్ల బీఎంసీ అధ్యక్షుడిగా కానుగుల రవికుమార్

**వెల్దండ, జనవరి 5 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కుప్పగండ్ల విజయ డైరీ బీఎంసీ అధ్యక్షులుగా కానుగల రవికుమార్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం నూతన బీఎంసీ అధ్యక్షులు రవికుమార్‌తో పాటు డైరెక్టర్లలు, రైతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీఎంసీ అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ అధ్యక్షులుగా అవకాశం కల్పించిన రైతులకు, డైరెక్టర్లులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేస్లి తండా సర్పంచ్ శ్రీనునాయక్,మాజీసర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, ఉప సర్పంచ్ జంగయ్య,నాయకులు నారకట్ల రమేష్‌యాదవ్, శ్రీధర్, నాగయ్య, మహేష్,వెంకటయ్య,దినేష్,కుమార్,రాజుగౌడ్,కృష్ణ, మహిపాల్‌రెడ్డి, మహేష్, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకుంటపల్లిలో శివమాలధారణ

**లింగాల, జనవరి 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలో శివభక్తులు సోమవారం గురుస్వామి ఏదుల శ్రీను ఆధ్వర్యంలో శివ మాలధారణ చేశారు. ఈ శివ భక్తులు అచ్చంపేటలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో శివమాలధారణ ధరించారు. శివ మాలధారణ ధరించి 41 రోజుల పాటు దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ శివ స్వాములు కొత్తకుంటపల్లిలో నెల్లికొండపై వెలసిన శివాలయంలో ప్రతిరోజూ పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గురుస్వామి ఏదుల శ్రీను తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో తిరుమల నాథ స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

**బాలానగర్,జనవరి5 ప్రభాతవార్త:**బాలానగర్ మండలం పెద్దరేవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తిరుమలనాథ స్వామి గుట్టపై స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరుమలనాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సాదువెంకటరెడ్డి, గ్రామ పెద్దలఆధ్వర్యంలో గత మూడురోజులుగా కల్యాణోత్సవం, రథోత్సవం,శకటోత్సవం,చక్రతీర్థం,జాతర అంగరంగ వైభవంగా జరిగాయి.చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మూడు రోజులుగా జరుగుతున్నబ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలనాథస్వామి గుట్టపై, పెద్దరేవల్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ధన్వాడ కేజీబీవీలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం

**ధన్వాడ, జనవరి 5 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం సోలార్ ప్లాంట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను గ్రామ సర్పంచ్ పంది జ్యోతి రామచంద్రయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని, ప్రయోగాత్మకంగా నేర్చుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో ఎంఈఓ గాయత్రి, పాఠశాల ప్రత్యేక అధికారి కల్పన, ఉపసర్పంచ్, పూజారి నర్సింలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నర్వ ఎంపీడీఓగా ట్రైనీ కలెక్టర్ కె.ప్రణయ్‌కుమార్

**నర్వ, జనవరి 5 ప్రభాతవార్త :** నర్వ ఎంపీడీఓగా ట్రైనీ కలెక్టర్ కె.ప్రణయ్‌కుమార్ సోమవారం భాధ్యతలు స్వీకరించారు. యాస్పిరేషన్ ప్రోగ్రాంలో భాగంగా నర్వ మండలం ఎంపిక కావడంతో ఈ నెల 5వ తేదీ నుండి ఫిబ్రవరి 2 వరకు నాలుగు వారాల పాటు నర్వ ఎంపీడీఓగా నియమించడం జరిగింది. సోమవారం నర్వ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ నర్వ మండలంలో పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతుల పర్యవేక్షణ,ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. నాలుగు వారాల వ్యవధిలో మండల పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నర్వ మండల అభివృద్ధి కోసమని పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.



ట్రైనీ కలెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులను అందజేసిన జిల్లా కలెక్టర్

**గద్వాల జనవరి 5, ప్రభాతవార్త:** సోమవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవద్ధుల శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది మంది ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు సమాజంలో సమాన హక్కులు,గౌరవం,భద్రత కల్పించడమే ఈ గుర్తింపు కార్డు యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్డు ద్వారా ట్రాన్స్ జెండర్ వ్యక్తులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు,విద్యా సహాయం,ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవలు వంటి అనేక సేవలను సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న మొత్తం ఎనిమిది మంది ట్రాన్స్ జెండర్ వ్యక్తులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిశీలన పూర్తి చేసి ట్రాన్స్ జెండర్ సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను అందజేసినట్లు తెలిపారు. అర్హులైన ట్రాన్స్ జెండర్ వ్యక్తులు సంబంధిత ప్రభుత్వ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఈగుర్తింపు కార్డును పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉందని,వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద,ట్రాన్స్ జెండర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 7వ చిన్న నీటి వనరుల గణన జనవరి 15లోగా పూర్తి చేయాలి

- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి5, ప్రభాతవార్త:** 7వ చిన్న నీటి వనరుల గణన ఈ నెల 15 లోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి, తహశీల్దార్ లు, ఎం.పి.డి. ఓ లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజావాణి కార్య క్రమం అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశం లో చిన్న నీటి వనరుల గణన పై కలెక్టర్ సూచనలు జారీ చేశారు. చిన్న నీటి వనరుల గణన లో మహబూబ్ నగర్ జిల్లా ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేవలం 20 శాతం గ్రామాల్లో మాత్రమే గణన జరిగిందని, జనవరి 15 లోగా నూరు శాతం సర్వేనుఆన్ లైన్ లోక్షేత్ర స్థాయిలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు,జి.పి. ఓ.లు,ఫీల్డ్ అసిస్టెంట్ లో గణన పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి,ఎం.పి.డి. ఓ.లను,తహశీల్దార్లను వెబెక్స్ ద్వారా ఆదేశించారు.మండలం లో సమావేశం నిర్వహించి గణన పై సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నర్సింహులు,ఆర్.డి. ఓ నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## టిజిఓ నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి5, ప్రభాతవార్త:** తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టి.జి.ఓ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసుధన్ నాయక్, గెజిటెడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామకృష్ణ గౌడ్, గెజిటెడ్ జిల్లా అధ్యక్షులు విజయ్, సెక్రటరీ వరప్రసాద్ ట్రెజరర్ కె. టైటస్ పాల్ జిల్లా పరిషత్ సీఈఓ వెంకట రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి నవీన్,డి.పి.ఆర్.ఓ శ్రీనివాస్ , తెలంగా గెజిటెడ్ అధికారుల జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గెజిటెడ్ అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ. నూతన సంవత్సరము లో ఇంకా ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు.

## తిరిగి బీఆర్ఎస్‌లోకి నాన్ చెరువు తండా సర్పంచ్

**వెంకట్ నాయక్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**



కండువాపు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి

**జడ్చర్ల, రాజాపూర్ జనవరి 5 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల నాన్ చెరువు తండా నూతన సర్పంచ్ వెంకట్ నాయక్ సోమవారం జడ్చర్ల మాజీ శాసనసభ్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి సమక్షంలో హైదరాబాద్ లోని తన నివాసంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచిగా గెలిచిన అనంతరం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ వెంకట్ నాయక్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం తిరిగి బి ఆర్ ఎస్ పార్టీలో చేరిన వెంకట్ నాయక్ కు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శాలువా కప్పి ఆహ్వానించారు. మాజీ మంత్రి వెంట పి.ఆర్.ఎస్ యువ నేత చింకోడు అభిమన్యు రెడ్డి తదితరులు ఉన్నారు.

## చెన్నవెల్లి గ్రామంలో నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు

**వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ తోట భార్గవి శేఖర్ రెడ్డి**



**రాజాపూర్, జనవరి 5 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలో సెమ్కార్ప్ గ్రీన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సోలార్ కంపెనీ తన సొంత రూ.6 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. సోమవారం చెన్నవెల్లి గ్రామ సర్పంచ్ పానుగంటి యాదగిరి, డిప్యూటీ సర్పంచ్ తోట భార్గవిశేఖర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి, సోలార్ కంపెనీ అధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ భారత దేశంలో రిన్యువబుల్ ఎనర్జీ రంగంలో ముందంజలో ఉన్న సెమ్కార్ప్ గ్రీన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ సొంత వ్యయంతో చెన్నవెల్లి గ్రామంలో శుద్ధి నీటి ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం గ్రామ ప్రజలకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. గ్రామ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ ప్లాంట్ ఉపయోగపడనుందని గ్రామ అభివృద్ధి పట్ల సానుభూతితో స్పందించి సహకరించిన సెమ్కార్ప్ గ్రీన్ ఇన్ఫ్రా సంస్థకు గ్రామ సర్పంచ్, గ్రామస్థుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈవాటర్ ప్లాంట్ కు తన వంతుగా రూ.20 వేలు ఖర్చు చేశానని అన్నారు. అదేవిధంగా వాటర్ ప్లాంట్‌కు సహకరించిన సోలార్ కంపెనీ అధికారులు ప్రగ్నేష్, అశ్వంత్, సైట్ ఇంచార్జ్అధికారులు వీరబాబు,సతీష్, శ్రీనివాస్‌ని గ్రామ సర్పంచ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పానుగంటి యాదగిరి, గ్రామ కార్యదర్శి, జయశాలిని, గ్రామ ఉపసర్పంచ్ తోట భార్గవిశేఖర్ రెడ్డి, వార్డ్ మెంబర్లు శేఖర్ రెడ్డి, పిట్టల శివ కుమార్, తిరుపతి రెడ్డి,శంకర్, కిష్టారం రమ్యశివారెడ్డి, శివలీల, మణెమ్మ, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఏలు, పిఆర్సిని వెంటనే ప్రకటంచాలి

**అలంపూర్ జనవరి5, ప్రభాతవార్త:** ఉద్యోగ ఉపాధ్యాయులకు, రావలసిన పెండింగ్ డి.ఏ. లు,పి. ఆర్. సి ని వెంటనే ప్రకటంచాలని టీ ఎస్ యూ టీ ఎఫ్,జిల్లా అధ్యక్షులు డి రమేష్ డిమాండ్ చేసారు. సోమవారం అలంపూర్ లోని స్థానిక హరిజనవాడ ఉన్నత పాఠశాల ఆవరణలో, పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అమరేందర్ రెడ్డి చేతుల మీదుగా టీ ఎస్ యూ టీ ఎఫ్,2026 సంవత్సరపు క్యాలెండర్ను ఆవిష్కరించడం జరిగినది .ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి.రమేష్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల కోసం పోరాడే ఏకైక ఉద్యమ సంఘం టీ ఎస్ యూ టీ ఎఫ్ అని తెలియజేస్తూ, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన డిఏలు,పి.ఆర్.సి ని వెంటనే ప్రకటించండి లేదంటే సంక్రాంతి పండుగ తర్వాత ఉద్యమకార్య చరణ ప్రకటిస్తామని తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సి.రాముడు, సీనియర్ నాయకులు మాబు సాబ్, స్వరాజ్‌బాబు, సుజ్ఞానం భరత్ కుమార్, వై వెంకటేశ్వర్లు, వెంకటరాముడు ,రాజ్ కుమార్ ,ఎల్లాకృష్ణ, బిశ్రీనివాసులు, రాజశేఖర్,రమణారెడ్డి,ఈదన్న,సురేష్ ,మధు నాయుడు, అదేవిధంగా మహిళా ఉపాధ్యాయులు సరోజ,, అన్నపూర్ణ, పాల్గొన్నారు.




## కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

- చైర్మన్‌గా ఉండి పదోవార్డుకు ఒరగబెట్టిందేమి లేదు
- పదేళ్లలో జరగని అభివృద్ధి పనులు కాంగ్రెస్ రెండేళ్లలో చేసింది
- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్

**భూత్పూర్,జనవరి 5,ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని గత పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ విమర్శించారు. ఇక్కడి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంక టేశ్వర్‌రెడ్డి తన కమిషన్ల కోసమే ప్రాకులాడారే తప్పా భూత్పూర్ మున్సిపాలిటీకీ చేసిందేమిలేదని ఆరోపించారు.మున్సిపాలిటీలోని పదివార్డు లలో రోడ్లు,డ్రైనేజీలు అధ్వాన్న స్థితికి చేరుకున్న పట్టించుకోలేదని విమర్శించారు.సోమవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవీన్‌గౌడ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆల ఆదివారం నిర్వహించిన నియోజకవర్గంలోని మున్సి పాలిటీలకు చెందిన నాయకులు,కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ,అవాక్కులు చవాక్కులు మాట్లాడాదని అన్నా రు.తమ ఎమ్మెల్యే జీఎంఆర్ మున్సిపాలిటీల అభివృద్ధికి కోట్లాది నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు.చైర్మన్ గా పనిచేసిన బస్వరాజ్‌గౌడ్ తాను ప్రాతినిథ్యం వహించిన పదోవార్డులో రోడ్లు,డ్రైనేజీలను అస్సలు పట్టించుకోలేదని విమర్శించారు.పదేళ్లలో బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలు తమ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి అమలు చేసిందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఇందిరమ్మ ఇళ్లు,గృహజ్యోతి పథకం కింద రెండొందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి సంక్షేమ పథకాలు అమలు చేసి అనతికాలంలోనే అందరి మన్నల్ని పొందారని పేర్కొన్నారు.భూత్పూర్ మున్సిపాలిటీలోని పలువార్డులలో కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పరిచారని పేర్కొన్నారు.వార్డులతో పాటు భూత్పూర్ పట్టణం నుంచి వివిధ గ్రామాల లింక్ రోడ్లకు బీటీ రోడ్ల వేయించారని పేర్కొన్నారు.విలేకరుల సమావేశంలో పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెంద్యాల పద్మతో పాటు నాయకులు లిక్కి విజయ్‌గౌడ్,బోరింగ్ నర్సింహులు,కెంద్యాలమశ్చేందర్,ఆఫ్రోజ్,మట్టి ఆనంద్,కోరె పవన్,కెంద్యాల రాజేష్,మల్లేష్,లిక్కి రాజేష్,సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధి కోసమే చేప పిల్లల పంపిణీ



అప్పాయిపల్లి ఉప్పు చెరువులో ఉచిత చేప పిల్లలను వదులుతున్న సర్పంచ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, సంఘం సభ్యులు

**లింగాల, జనవరి 5 ప్రభాతవార్త:** మత్స్యకారుల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేసినట్లు సర్పంచ్ విజయకృష్ణ అన్నారు. సోమవారం లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘానికి పంపిణీ చేసిన చేప పిల్లలను సర్పంచ్ విజయకృష్ణ తో కలిసి సంఘం అధ్యక్షులు ,సభ్యులు గ్రామ సమీపంలోని ఉప్పు చెరువు,గొర్మికకుంట, దేవుని చెరువు, పోతపురం చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని తెలిపారు. మత్స్యకారులు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో గ్రామానికి 2 లక్షల 34 వేలు చేప పిల్లలను అందజేశారు. అదేవిధంగా గ్రామంలో ప్రతి వార్డులో శ్రమదానం కార్యక్రమంనిర్వహించారు. ఏమైనా సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బతికె సైదులు,ఉపాధ్యక్షులు సలేశ్వరం,పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు అరవింద్, అంగన్‌వాడీ టీచర్లు సాలెమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**వైద్యం కోసం వచ్చిన వారితో సిబ్బంది పలకరింపు సగం రోగం నయమవుతుంది : సిహెచ్‌సి సూపరిండెంట్ డా. వాణి**



ఉప్పునుంతల ఆసుపత్రిలో సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న సిహెచ్‌సి సూపరింటెండెంట్ డా. వాణి

**ఉప్పునుంతల, జనవరి 5 ప్రభాతవార్త :** వైద్యం కోసం వచ్చిన రోగులను వైద్య సిబ్బంది పలకరింపుతోనే సగం రోగం నయమవుతుందని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డా. వాణి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు మందుల నిల్వ లపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపి సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి పనితీరు, సిబ్బంది విధుల నిర్వహణ, రోగులకుఅందు తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డా. వాణి మాట్లాడుతూ వైద్య సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, విధులకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. రోగుల పట్ల దురుసు ప్రవర్తనకు ఎట్టి పరిస్థితుల్లోను ప్రవర్తించ కూడదని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేసి ఆసుపత్రి ప్రతిష్ఠను కాపాడాలని సిబ్బందికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యాధికారిణి డా. వాణితో పాటు డా. శివలీల, నర్సింగ్ ఆఫీసర్లు ఉఫత్, సుశీల, నిర్మలతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు సమిష్టిగా పని చేయాలి



అంబట్ పల్లి సర్పంచ్, ఉపసర్పంచులకు సన్మానిస్తున్న తహసీల్దార్, ఎంపిడిఓ

**లింగాల, జనవరి 5 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమిష్టిగా పని చేయాలని ఎంపిడిఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం లింగాల మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన సర్పంచులు, ఉపసర్పంచులకు పరిచయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు గ్రామాల్లో వీధిలైట్లు, శానిటేషన్, గ్రామస్తులకు త్రాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సర్పంచులు బాధ్యతగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలని కోరారు. సేవాగుణంతో పని చేసే వారికి ప్రజల గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తూ ముందుకు వెళ్ళాలని కోరారు. గెలిచిన సర్పంచులు, సర్పంచి పోటీ చేసి ఓడిపోయిన వారు కూడా ఖర్చులు వివరాలను ఎంపిడిఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అనంతరం గెలిచిన సర్పంచులు, ఉపసర్పంచులకు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ రాములు, తహసీల్దార్ వెంకటేష్, ఎపిఓ హిమామ్ అలీ, హౌసింగ్ ఏఈ గాయత్రి,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని గ్రామస్తుల ఫిర్యాదు



ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**నవాబుపేట,జనవరి5 ప్రభాతవార్త :** మండల ప్రజావాణిలో సోమవారం మూడు ఫిర్యాదులు వచ్చాయి. రెండు రెవెన్యూ రాగా మరొకటి గ్రామ పంచాయతీ ప్రభుత్వ భూమి పైఫిర్యాదువచ్చింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి కొంత భాగం కనిపించడం లేదని మండల కార్యాలయానికి అతి చెరువులో ఉన్న శ్రీరామ వెంచర్ పై సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్తులు ప్రజా ప్రతినిధులు ఎంపీడీవో జయరాం నాయక్ కు ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. కాగా శ్రీరామ వెంచర్ సర్వేనెంబర్ 769 లో చేశారు. ప్రాథమికంగా పొజిషన్‌లో ఉండాల్సింది సర్వే నంబర్ 772 లో అయితే ప్రభుత్వ భూమి దాదాపు 5 ఎకరాల 14 గుంటలు ఉండాలని అంచనా. వాస్తవ అధికారిక వెంచర్ విస్తీర్ణం 3.2 ఎకరాలు అయితే వెంచరుకు ఆనుకొని ప్రభుత్వ భూమి 5.14 ఎకరాలు ఉండటంతో, ఎవరు ఏ మాయ చేసారో కానీ ప్రభుత్వ భూమి కొంత కనిపించడం లేదు. రెండేళ్ల క్రితమే శ్రీరామ వెంచర్లో ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ భూమి ఐదు ఎకరాల 14 గంటల భూమిలో సగానికి పైగా భూమి కబ్జా చేశారని వదంతులు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ జరిపి శ్రీరామ వెంచర్కు హద్దులు పెట్టి ప్రభుత్వ భూమికి కూడా సర్వే చేసి అన్యాక్రాంతం కాకుండా చూడాలని గ్రామస్తులు అంటున్నారు. మరి ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా చేశారా లేక ఏ సర్వే నెంబర్లు ఏ పొజిషన్లో ప్రభుత్వ భూమి ఉందో సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని అక్రమార్కుల చేతుల్లోకి ప్రభుత్వ భూమిని పెట్టొద్దని వారు శ్రీరామ వెంచర్ పై సర్వే చేసి ప్రభుత్వ భూమికి హద్దులు ఉంచాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అఖిలపక్ష సమావేశం

**మక్తల్ టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపల్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలు , అందులో భాగంగా బహుజన సమాజ్ పార్టీ, మక్తల్ అసెంబ్లీ అసెంబ్లీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బహుజన సమాజ్ పార్టీ నాయకులు మాట్లాడుతూ నాయకులు మాట్లాడుతూ మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో 16 వార్డులకు సంబంధించి ఓటర్ లిస్టులలో అనేక పేర్లు తారుమారు కావడం జరిగిందని అలాగే ఒక వార్డ్ నుండి ఇంకో వార్డు కి ఓటర్లను మార్చారని ఓటర్ డ్రాపవుట్‌కి సంబంధించి కలర్ ఫోటోకు సంబంధించిన లిస్టు ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ అధ్యక్షుడు కే.వి నరసింహ, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జుట్ల నరేందర్, బహుజన సమాజ్ పార్టీ మక్తల్ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్‌తో పాటుగా అఖిలపక్ష నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మద్దతు ధరకు కందులను అమ్ముకోవాలి



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**నర్వ, జనవరి 5 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంలోనే రైతులు పండించిన కందులను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకోవాలని ఇంఛార్జ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తెలిపారు.సోమవారం నర్వ మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనం వద్ద తెలంగాణ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నాఫెడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసినకందుల కొనుగోలు కేంద్రాన్ని ఇంఛార్జ్ కలెక్టర్ ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.8 వేలకు కందులు కొనుగోలు చేస్తున్నట్లు ఇంఛార్జ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తెలిపారు. దళారుల జోక్యం లేకుండా నేరుగా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు జరుగుతుండటంతో నర్వ మండల రైతుల్లోఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో నర్వ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం చంద్రశేఖర్, సంతోష, యాంకి లలితమ్మ, జయమ్మ, గంగాధర్, గ్రామ సర్పంచ్ టి.హన్మంత్ రెడ్డి, ఉపసర్పంచ్ దండు అజయ్ పాల్గొన్నారు.

## నేడు బండ్లు, బోనాలతో వైభవంగ మైసమ్మ జాతర

**నవాబుపేట,జనవరి 5 ప్రభాతవార్త:** నేడు పర్వతాపూర్ మైసమ్మ జాతర ఆఖరి రోజు కావడంతో బండ్లు బోనాలతో వైభవంగా జరగనుంది. భాగంగా సోమవారం అత్యంత వైభవంగా జాతరకు వచ్చిన భక్తుల ఆలయ ధర్మకర్తల మండలి, ఆలయ అధికారుల సమక్షంలో చండీ హోమం నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదం చేశారు. నేడు మంగళవారం మరింత వైభవంగా బండ్లు బోనాలతో తీర్థప్రసాదాలతో శ్రీశ్రీశ్రీ మహిమాన్విత పర్వతాపూర్ మైసమ్మ ఆలయం భక్తులతో శివసత్తులతో మరింత వైభవోపేతంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నరసింహులు, చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, మాజీ చైర్మన్లు, గ్రామ సర్పంచ్ బాలయ్య, డిప్యూటీ సర్పంచ్ అంబేద్కర్, గ్రామ ప్రజా ప్రతినిధులు మైనుద్దీన్, బాలయ్య, నరేందర్, మాధవులు, మల్లేష్,గోపాల్, ఆలయపూజారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు యువకులు, యువతులు, గ్రామస్తులు జాతర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, జనవరి 5 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో గెజిట్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ భూములను ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వక్ఫ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోఆయా ప్రాంతాల్లో 898.36 ఎకరాలు ఉన్న వక్ఫ్ భూములు అక్కడక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని సంరక్షించి వక్ఫ్ బోర్డుకు అప్పగించాల్సిందిగా కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ ఎక్కడెక్కడ ఆక్రమణలు జరుగుతున్నట్లు గుర్తించారో వాటి వివరాలు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కమిటీ సభ్యులను సూచించారు.గెజిట్ ప్రకారం ఉన్న వక్ఫ్ భూములకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ బాలాజీ నాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అప్జలుద్దీన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

**సిఐ కమలాకర్ హెచ్చరిక**
**జడ్చర్లలోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు**



షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ

**జడ్చర్ల జనవరి 5 ప్రభాతవార్త:** గాలిపటాలు ఎగురవేయడానికి చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జడ్చర్ల సిఐ కమలాకర్ హెచ్చరించారు. జడ్చర్ల మున్సిపాలిటీలో సోమవారం వివిధ షాపుల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. చైనా మాంజా విక్రయిస్తున్నట్లు అనుమానంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. చైనామాంజ అని గుర్తించిన పలు షాపుల దుకాణ దారులకు హెచ్చరికలు జారీ చేసి మాంజాలను సీజ్ చేశారు. ఎక్కడైనా దుకాణాల్లో చైనా మాంజా విక్రయించినట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. చైనా మాంజా వల్ల వాహనదారులు ముఖ్యంగా చిన్నపిల్లలుగాయాల పాలవుతున్నట్లు గుర్తించి మహబూబ్నగర్ జిల్లా ఎస్పీజానకి ధరావత్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఆయన వెంట ఎస్సైలు మల్లేష్, జయప్రసాద్, ఖాదర్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పిఆర్‌టియు టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**శ్రీరంగాపూర్, జనవరి 5 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని శ్రీశ్రీరంగనాయక స్వామి దేవాలయం సన్నిధిలో పిఆర్టియు టీఎస్ శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు వసంతపురం రాజు ప్రధాన కార్యదర్శి నాని విష్ణువర్ధన్ నాయుడు ఆధ్వర్యంలో ముఖ్య అధికారుల యూనియన్ నాయకుల చేతుల మీదుగా క్యాలెండరును ఆవిష్కరించడం జరిగింది. అధ్యక్షులు వసంతపురం రాజు మాట్లాడుతూ సంఘం ఏర్పడి 50 ఏళ్లకు పైన అవుతున్న ఏర్పడ్డ నాటి నుంచి ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాడుతుందని అన్నారు. గత పిఆర్సి కమిటీ కేవలం7.5 ప్రతిపాదించగా నాటి రాష్ట్ర అధ్యక్షులు నేటి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి చొరవతో 30 పిఆర్సి సాధించిన సంఘం పిఆర్‌టియు టిఎస్ అని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కొరకు కొన్ని చర్యలు చేపట్టిన ఇంకా చాలా సమస్యలు సిపిఎస్ విధానం రద్దు హెల్త్ కార్డు అమలు పెండింగ్ డిఏ ల మంజూరు పెండింగ్ బిల్లుల చెల్లింపులాంటి సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయని వాటన్నిటిని త్వరగా పరిష్కరించాలని తక్షణమే మెరుగైన ఫిట్‌మెంట్‌తో పిఆర్సి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. ఒకవైపు ఉద్యోగం ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతూ మరోవైపు ప్రభుత్వ పాఠశాలలకు విచ్చేస్తున్నవిద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. అందువల్ల అత్యధిక రాష్ట్ర జిల్లా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పిఆర్‌టియు టిఎస్ ప్రతినిధులు సాధించగలిగారని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల ఎంపీడీవో రవి నారాయణ, మండల విద్యాధికారి హనుమంతురావు,కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు జ్యోతి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ , శ్రీరంగాపూర్ సర్పంచ్ ముంతా మద్దిలేటి, మాజీ ఎంపిటిసి ఎల్లస్వామి, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరి గోవిందు, రామచంద్రయ్య, విష్ణు, రామ రాజు, బహుజన రమేష్, పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులురామచంద్రయ్య, శివశంకర్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జయంత్ రెడ్డి, మండల అధ్యక్షులు దాసరి చిన్న రాములు, శ్రీరంగాపూర్ మండలఅసోసియేట్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు పృద్వి మాత,ఉపాధ్యక్షులు నరేష్, కార్యదర్శి దామోదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



పిఆర్‌టియు టిఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం